క్లుప్తంగా

నేడు వినియోగదారుల అవగాహన సదస్సు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆహార, పౌరసరఫరాల వినియోగదారులకు సంబంధించి అవగాహన సదస్సును మంగళవారం నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ రెక్టార్ డి.సూర్యచంద్రరావు సోమవారం తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. వైస్ చాన్సలర్ కె.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ ఆహార, పౌరసరఫరాల వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి హెచ్.అరుణకుమార్, విశిష్ట అతిథిగా డాక్టర్ పీవీఎస్ మూర్తి పాల్గొంటారన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తారని సూర్యచంద్రరావు చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కృత్తివెన్ను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఏజెన్సీలు సక్రమంగా నిర్వహించాలని నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి అన్నారు. మండల పరిధిలోని చినపాండ్రాక ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు. కొంత మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేస్తున్న విషయాన్ని తాను గమనించానన్నారు. వారిని ప్రశ్నించగా పాఠశాలలో భోజనం నాణ్యంగా ఉండటం లేదన్న విషయాన్ని తెలిపారన్నారు. దీనిపై తాను ఆకస్మికంగా తనిఖీ చేశానని భోజన నాణ్యత విషయంలో ఏజెన్సీలు ఇంకా సరిదిద్దు కోవాలని సూచించినట్లు ఆమె తెలిపారు.

'నూతన జాబ్‌చార్ట్‌ను స్వాగతిస్తున్నాం'

అవనిగడ్డ: జీవో నంబర్ – 2 ద్వారా ఇటీవల పంచాయతీ కార్యదర్శులకు జారీ చేసిన నూతన జాబ్ చార్ట్‌ను స్వాగతిస్తున్నట్లు ఏపీ పంచాయతీ కార్యదర్శుల ఐక్యవేదిక కన్వీనర్ ఆది అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పంచాయతీకి ఒక సెక్రటరీ కేటాయింపు కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించిందన్నారు. ఇది పూర్తిగా కార్యరూపం దాలిస్తే మరింత సమర్థవంతంగా పనిచేసి సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి లక్ష్య సాధనకు పూర్తిగా తోడ్పాటునందిస్తామని చెప్పారు. గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శులకు అధికారాల బదలాయింపు, డీడీఓలకు అధికారాలు కల్పించడం వల్ల గ్రామ సచివాలయ వ్యవస్థలో ఇన్‌చార్జిల పాలన పోయి మరింత పారదర్శకమైన, ప్రజలకు అనువైన పాలన అందుబాటులోకి వస్తుందన్నారు. ఇటువంటి సంచలన విధాన పరమైన నిర్ణయాలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కల్యాణోత్సవం

పెడన: పట్టణంలోని 18వ వార్డు గాంధీనగర్‌లో వేం చేసి ఉన్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవస్థానంలో తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి వార్ల కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని మూడు రోజులు పాటు ప్రత్యేక పూజలు, అమ్మవారి కల్యాణం అనంతరం రాత్రి జ్యోతుల ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన, రాత్రికి తిరుపతమ్మ అమ్మవారి బుర్రకథ కార్యక్రమం ఉందన్నారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని భక్తబృందం కోరింది.

ఉద్యోగాల్లో వాటా కోసం ప్రజా ఉద్యమం



చల్లపల్లి: ఆర్యవైశ్య విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించినా ప్రభుత్వ ఉద్యోగాలు రావట్లేదని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రథమ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆదివారం రాత్రి స్థానిక కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య యువజన సంఘం – చల్లపల్లి స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాల్లో ఏ విధమైన ప్రభుత్వ ఉద్యోగాలకు నోచుకోవట్లేదన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు రాజకీయాల్లోకి రావాలని కోరారు. సభలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ కుమార్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రతికంటి రామచంద్రరావు, నాయకులు ఘంటసాల రాజమోహనరావు, జూపూడి సాయి, జల్లూరి ప్రసాద్, కొల్లిపర సతీష్, అత్తలూరి సుబ్బారావు ప్రసంగించారు. యువజన సంఘం అధ్యక్షుడు వరదా రాజశేఖర్, నేతలు మారుతీరామ్, కిషోర్, సత్యవెంకట సాంబశివరావు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులను సన్మానించారు.

ఏపీ పరిపాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- రూ.1.37 కోట్లతో జగనన్న కాలనీలో విద్యుదీకరణ



స్విచ్ ఆన్ చేసి విద్యుత్ సరఫరా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ల విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక జగనన్న కాలనీలో రూ.1.37 కోట్లతో పూర్తి చేసిన విద్యుదీకరణ పనులను ఎమ్మెల్యే సోమవారం ఉదయం ప్రారంభించారు. కాలనీలోని నాలుగు లే అవుట్ల విద్యుత్ లైన్లకు విద్యుత్ సరఫరా ప్రారంభించారు. 250 విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను స్విచ్ ఆన్ చేసి వెలిగించారు. ఈ విద్యుదీకరణ ద్వారా కాలనీలోని 975 ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

ప్రధాని కాదగిన సామర్థ్యం జగన్ సొంతం..

నెహ్రూ, రాజీవ్ గాంధీ నాటి నుంచి ఉన్న కాంగ్రెస్ పార్టీని ఢీకొట్టి నిలబడిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కచ్చితంగా ప్రధాన మంత్రి కాదగిన సామర్థ్యం ఉందని ఎమ్మెల్యే చెప్పారు. పట్టుదల, నిలకడ, ఆలోచన, సమర్థత కలిగిన సీఎం వైఎస్ జగన్ పరిపాలన చేపట్టిన మూడున్నరేళ్లలో రెండేళ్లు కరోనా ఉన్నా, కేవలం ఏడాదిన్నరలో పేదల అవసరాలను గుర్తించి సాకారం చేసి దమ్మున్న ముఖ్యమంత్రిగా నిరూపించుకున్నారన్నారు. విదేశీయులు సైతం సచివాలయ, వలంటీర్ల విధానాన్ని ప్రశంసిస్తున్నారని చెప్పారు. జగనన్న కాలనీల మెరక పనులు చేస్తుంటే, టీడీపీ నాయకులు అనేక రకాలుగా అడ్డుపడ్డారనీ, ఇప్పుడు గడప గడపకు వెళ్తుంటే, టీడీపీ ఇచ్చిన కాలనీల్లో నేటికీ సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పులి శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు(ఫణి), పంచాయతీ ఈఓ పడమట సుకుమార్, నాయకులు షేక్ నసీంఫెహారీ, బొందలపాటి లక్ష్మి, అబ్దుల్ కమాల్, బళ్లా లలితకుమారి, గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ యడ్ల జగదీష్, ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ అర్షద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేసే గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): రవాణా చార్జీల పేరుతో అధిక వసూళ్లకు పాల్పడే గ్యాస్ ఏజెన్సీ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిబంధనల మేరకు కాకుండా కస్టమర్ల నుంచి రవాణా చార్జీల పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు తనిఖీలు నిర్వహించి అక్రమ వసూళ్లకు పాల్పడే గ్యాస్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఐదు కిలోమీటర్ల లోపు వరకు ఉచితంగా డెలివరీ చేయాలని, 5 నుంచి 15 కిలోమీటర్ల లోపు రూ.20, 15 కిలోమీటర్ల పైబడి ఉన్న దూరాలకు రూ.30లు చొప్పున వసూలు చేయాలన్నారు. అంతకు మించి వినియోగదారుల వద్ద ఎక్కువ వసూళ్లకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జగనన్న పథకాలు ప్రజలకు చేరువచేయాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



కన్వీనర్లు, గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, పరిశీలకురాలు శ్రీలక్ష్మి

మోపిదేవి: దేశానికే ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువచేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోరారు. మండల కేంద్రం మోపిదేవి జెడ్పీపాఠశాల ఆవరణలో గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం మండల కన్వీనర్ కోసూరు శివనాగ మల్లేశ్వరావు అధ్యక్షతన సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ శిక్షణలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ.. పార్టీని గ్రామాల్లో మరింత బలోపేతం చేసేందుకు ఈనెల 9వ తేదీ నుంచి వారం రోజులపాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటా వలంటీర్లతో కలిసి తిరిగి ప్రభుత్వం అందించిన బుక్‌లెట్‌లో 'నా కోసం...నా పిల్లల భవిష్యత్ కోసం జగనన్నను నమ్ముతున్నానని వాగ్దానం చేస్తూ, ఐదు ప్రశ్నలకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని సూచించారు. వారి అనుమతితో ఇంటి వద్ద డోర్ లేదా గోడలకు స్టిక్కర్లు వేయాలని, వారి సెల్ ఫోన్‌లకు స్టిక్కర్ అంటించాలన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే ధైర్యంగా ముందుకు రావాలని, జగనన్నకు ధైర్యం మెండుగా ఉందని ఎమ్మెల్యే రమేష్‌బాబు చెప్పారు. చంద్రబాబు అధైర్యంతో ఆర్థిక సంపన్నులు, తోడేలతో కలిసి వస్తున్నారని ఎద్దేవా చేశారు. యువగళం పేరుతో లోకేష్ పాదయాత్ర చేపట్టగా ప్రజల్లో ఏమాత్రం స్పందన లేదన్నారు. పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర చేపడతానని ప్రగల్భాలు పలుకుతున్నా, చంద్రబాబు నాయుడు దగ్గర నుంచి అనుమతి లేనిదే బయటకు రాదని చెప్పారు. వారాహి వస్తే లోకేష్ పాదయాత్ర పెద్ద జీరో అవుతుందని, చూసేవారు కూడా ఉండరని బాబు గాబరా పడుతున్నారన్నారు.

బాబుకు మరోసారి బుద్ధి చెప్పాలి..

నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీ లక్ష్మి మాట్లాడుతూ.. జగనన్న అందిస్తున్న మెరుగైన పరిపాలనను ప్రజలకు అందించేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వంటీర్లకు శిక్షణ కల్పించినట్లు తెలిపారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీ లాగేసుకున్న బాబు, తిరిగి ఎన్టీఆర్ జయింతి, వర్ధంతుల సమయంలో ఎన్టీఆర్ ఫొటోలకు దండలు వేస్తున్నారన్నారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని, బీసీలు జడ్జీలుగా పనికిరారంటూ కేంద్రానికి లేఖ రాశారని, రిజర్వేషన్లు ఆపాలంటూ కోర్టుకెళ్లిన బాబుకు ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అనంతరం కిట్‌లను కన్వీనర్లు, గృహసారథులకు పంపిణీ చేశారు. దివివ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరావు, గ్రామ సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరావు, కొలసాని వెంకట కృష్ణ, ఏఎంసీ సభ్యులు అరజా లక్ష్మీతులసీ, రామావత్తుల పరమేశ్వరి, పీఏసీఎస్ చైర్ పర్సన్లు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ పార్టీ కన్వీనర్లు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం పాలన



వృద్ధుడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 10వ డివిజన్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ షేక్ ముంతాజ్ బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ బాషాలతో కలిసి గడప గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నవరత్న పథకాలతో లబ్ధి పొందిన వారికి ప్రభుత్వం ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు.

లబ్ధిదారుల్లో ఆనందం

ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల్లో ఉన్న పేదరికాన్ని నిర్మూలించే లక్ష్యంతో సీఎం జగన్ సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల్లో అవినీతికి తావులేకుండా అందజేస్తుండటంతో ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. నవరత్న పథకాలతో తమకు మొత్తం రూ.60,748 లు అందాయని అనగాని కనకదుర్గలక్ష్మి పేర్ని కిట్టుకు తెలిపింది. తనకు రూ.54,436లు, ఇంటి స్థలం, పక్కా గృహం మంజూరైందని మరో లబ్ధిదారు పురగంటి పద్మావతి, ఉప్పలపాటి ఝాన్సీ తనకు మొత్తం రూ.1,23,553, ఇంటిస్థలం, పక్కా గృహం మంజూరైందని చెప్పారు. లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ మొహమ్మద్‌సాహెబ్, సచివాలయ వైఎస్సార్ సీపీ కన్వీనర్ జ్యోతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వి.కొత్తపాలెంలో దుండగుల దుశ్చర్య



కాలిబూడిదైన సామగ్రి, విలువైన పత్రాలు

కోడూరు: మండల పరిధిలోని వి.కొత్తపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటికి పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. గ్రామానికి చెందిన మద్ది నిర్మల ఇటీవల నూతన గృహాన్ని నిర్మించుకొని అందులో నివాసముంటుంది. అయితే నిర్మల ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి గుంటూరులోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. దీంతో ఇదే అదునుగా భావించిన దుండగులు అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటి ప్రధాన ద్వారంపై పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు ఇళ్లంతా వ్యాపించి గృహోపకరణలు, విలువైన వస్తువులు దగ్ధమైయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు మంటలు సమీప ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రమాదంలో రూ.80 వేల నగదు, పొలానికి సంబంధించిన పత్రాలు, విలువైన వస్తువులు దగ్ధమైనట్లు బాధితురాలు తెలిపారు. ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించిందన్నారు. అగ్ని ప్రమాద ఘటనపై బాధితురాలు కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సామూహిక గృహ నిర్మాణాలకు శంకుస్థాపన



వెంకటాపురం లే అవుట్‌లో భూమి పూజ చేస్తున్న లబ్ధిదారులు

వెంకటాపురం(మోపిదేవి): మండల పరిధిలోని వెంకటాపురంలో జగనన్న కాలనీలో గృహనిర్మాణాలకు సోమవారం సామూహికంగా శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వ అధికారుల చొరవ, బ్యాంకు అధికారుల చేయూతతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. తహసీల్దార్ కె.నవీన్‌కుమార్, గృహనిర్మాణశాఖ ఏఈ తాండవ కృష్ణ, స్థానిక సర్పంచ్ తుమ్మా సోములమ్మ, మాజీ ఎంపీటీసీ అబ్బూరి నాంచారయ్య పలు మార్లు లబ్ధిదారులతో సమావేశమై రవాణా ఖర్చుల నియంత్రణకు సామూహిక నిర్మాణాలకు ప్రోత్సహించారు. లబ్ధిదారులు వారి వారి సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి, శంకుస్థాపన చేశారు. లే అవుట్‌లో 40 మంది లబ్ధిదారులు ఉండగా, ఇప్పటికే 15 మంది నిర్మాణాలు ప్రారంభించగా, మిగిలిన వారు ఒకేసారి నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి ఒక్కొక్క లబ్ధిదారునికి 30 బస్తాల సిమెంట్, 45 ఇనుప సువ్వలు, ట్రక్కు ఇసుకను తహసీల్దార్ కె.నవీన్‌కుమార్, గృహనిర్మాణశాఖ ఏఈ తాండవ కృష్ణ అందించగా, పెదకళ్లేపల్లి ఇండియన్ బ్యాంకు మేనేజర్ గోపీకృష్ణ ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు రుణం అందించారు. ఇదే కాలనీలో అంతకు ముందు 88 గృహాలు పూర్తయ్యాయని ఏఈ తెలిపారు. గ్రామ పెద్దలు తుమ్మా చంద్రశేఖర్, రవి, ఏపీఎం శ్రీనివాస్, వీఆర్వో ప్రసాద్, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న చారుమతి తదితరులు

పెడన: మండలంలోని పెనుమల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన దేవరపల్లి రాంబాబు ఇల్లు సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుదాఘాతానికి గురైంది. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో రాంబాబు కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ గరికిపాటి వెంకటరామానాయుడు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతిలతో పాటు మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావులు బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇంటి నిర్మాణానికి తగు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని రెవెన్యూ అధికారులు తెలిపారు. తక్షణ సాయంగా 25 కేజీలు బియ్యం, కాయగూరలు అందించారు. గరికిపాటి బ్రదర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం, భోజన వసతి ఏర్పాటు చేశారు.

ఈ ప్రమాదంలో లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగిందని బాధిత కుటుంబం తెలిపింది. కార్యక్రమంలో సింగంశెట్టి రాంబాబు, గరికిపాటి వెంకట్రావు తదితరులున్నారు.

వంగవీటి రంగా అందరివాడు



రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన పేర్ని కిట్టు, వంగవీటి నరేంద్ర

కోనేరుసెంటర్: కులమతాలకు అతీతంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వంగవీటి మోహనరంగా అందరివాడని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పేర్ని కిట్టు అన్నారు. బందరు మండలం జొన్నలవారిమోడి గ్రామంలో ఆదివారం రాత్రి స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కిట్టు మాట్లాడుతూ జనం కోసం పుట్టే వ్యక్తులు కొందరు మాత్రమే ఉంటారన్నారు. అలాంటి వ్యక్తుల్లో వంగవీటి మోహనరంగా ఒకరన్నారు. వంగవీటి నరేంద్ర మాట్లాడుతూ రంగా జీవితం యువతకు ఆదర్శనీయమన్నారు. రాజకీయంగా ఆయన ఎదుగుదలను ఓర్వలేని శత్రువులు రంగా జీవితాన్ని అర్ధాంతరంగా హతం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు పార్టీల నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన నాయకులు శీలం మారుతీరావు, మాదివాడ రాము, కొట్టే వెంకట్రావు, బండి రామకృష్ణ, గోపు సత్యనారాయణ, కుమారి, సన్నిధి నాగసాయి, పి.వి.ఫణికుమార్, షేక్ మౌలాలి, చల్లపల్లి జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, రాధారంగ మిత్రమండలి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి. సోమవారం ఉదయం కల్యాణమూర్తులకు వసంతోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ఆలయ సమీపంలోని కోనేరులో పండితులు అవభృందోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ప్రత్యేక పల్లకిలో స్వామివార్లను ఊరేగించి ఆలయ ప్రాంగణంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించి, యాగశాలలో పూర్ణాహుతిని జరిపారు. రాత్రికి కల్యాణమూర్తులకు పుష్పాభిషేకం, పవళింపుసేవ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా అనంతవరానికి చెందిన కుప్పా రామగోపాల సోమయాజీ దంపతులు ఉత్సవాలకు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆదివారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కల్యాణమూర్తులకు రథోత్సవాన్ని నిర్వహించారు. ముగింపును పురస్కరించుకొని స్వామివారి మూలమూర్తికి వెండి కవచాలను అలంకరించారు. ఆలయ ఈఓ సుధాకర్, జేఏ ఏడుకొండలు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుష్మా

మచిలీపట్నంటౌన్: కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరమని డాక్టర్ సుష్మా తెలిపారు. జాతీయ కుష్ఠు నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వపరంగా జిల్లాలో నిర్వహిస్తున్న కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక లేడి యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శరీరంపై వచ్చే పలు మచ్చలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కుష్ఠు వ్యాధి మచ్చలు సహజ చర్మపు రంగు కట్టి తక్కువ లేదా ఎరుపు లేదా రాగి రంగు కలిగి ఉంటాయన్నారు. మచ్చపై స్పర్శ, నొప్పి ఉండదని చెప్పారు. మరో వైద్యుడు వేణుగోపాల్ మాట్లాడుతూ చెవులు, ఛాతీ మీద కణుతులు, కాళ్లు, చేతులు మొద్దుబారిన, శరీరంపై నూనె రాసినట్లు ఉన్నా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇలాంటి లక్షణాలు ఉంటే ఆశావర్కర్, ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్ఠు వ్యాధి చికిత్సకు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి లంకిశెట్టి హరినాథ్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్ సుభాషిణి, ఏఎన్‌ఎం శ్యామసుందరి, పారా మెడికల్ అధ్యాపకులు హిరణ్మయి సాజిత, జ్యోతి, స్పందన పాల్గొన్నారు.

211 మందికి వైద్య పరీక్షలు

కృత్తివెన్ను: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగమూడి ఉన్నత పాఠశాల వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎనిమిది విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు శిబిరంలో పాల్గొని 211 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి డాక్టర్ సూర్య రగుతు, నీల్ రగుతుల ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను అందజేసినట్లు నిర్వహకుడు కూనసాని నాగు తెలిపారు.

పీహెచ్‌సీ సమస్యల పరిష్కారానికి చర్యలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అభివృద్ధి కమిటీ నిర్ణయించింది.

పీహెచ్‌సీ ఆవరణంలో కమిటీ చైర్మన్, ఎంపీపీ వి.చినబాబు అధ్యక్షతన సోమవారం కమిటీ సమావేశం జరిగింది. ఆస్పత్రి గ్రాంటుతో పాటు మండల పరిషత్ గ్రాంటు నుంచి రూ.2 లక్షలతో పీహెచ్‌సీలో ఇంటర్నెట్ సదుపాయం, ల్యాబ్ ఎక్యూప్‌మెంట్, నీటి సౌకర్యం తదితర సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. కన్వీనర్ డాక్టర్ కె.సువర్చల నివేదిక అందజేశారు. అనంతరం కన్వీనర్ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో ఈఓపీఆర్డీ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు. రికార్డులు పరిశీలించిన ఎంపీపీ చినబాబు వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మినీ వ్యాన్ బోల్తా : కూలీ మృతి

కోనేరుసెంటర్: సిమెంట్ లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో ఓ కూలీ మృతి చెందగా, మరో ముగ్గురు కూలీలకు గాయాలైన సంఘటన మచిలీపట్నంలో సోమవారం రాత్రి జరిగింది. మచిలీపట్నం నుంచి సిమెంట్‌లోడుతో గూడూరు వైపు వెళ్తున్న మినీ వ్యాన్ మూడు స్తంభాలసెంటర్ దాటిన తర్వాత బోల్తా పడింది. వ్యాన్‌పై ఉన్న నలుగురు కూలీల మీద సిమెంట్ బస్తాలు పడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా నాలుగో వ్యక్తికి బలమైన గాయాలయ్యాయి.

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో నాలుగో వ్యక్తి మృతిచెందాడు. మృతి చెందిన వ్యక్తిని మచిలీపట్నంకు చెందిన జంపాన తిరుపతయ్య(19)గా గుర్తించారు.

దూప, దీప నైవేద్యాలకు ప్రభుత్వ సాయం



అర్చకుడికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెం శ్రీసీతారామాలయానికి రాష్ట్ర ప్రభుత్వం దూప, దీప నైవేద్యాలకు మంజూరైన రూ.5 వేలను స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అందజేశారు. ఆలయ అర్చకుడు అడుసుమిల్లి సాయి మణిశశిధర్‌కు నగదును సోమవారం సాయంత్రం అందించారు. ప్రతి నెల నగదు ఇస్తున్నారని ఆలయ అర్చకుడు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎంపీటీసీ మత్తి లత, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ, మత్తి రాంబాబు, మత్తి శ్రీనివాసరావు, మంగారావు, వీఆర్వో మత్తి గోపాల కృష్ణ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బైపాస్ మీదుగా వాహనాల రాకపోకలు



పెడన: పెడన – మచిలీపట్నం ప్రధాన రహదారిలోని రైల్వే గేటు మూడు రోజుల పాటు మూసివేయడంతో బైపాస్ రోడ్డులో వాహనాల రాకపోకలు సాగాయి. దీంతో బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ కొనసాగింది. బైపాస్ రోడ్డులో ఫ్లై ఓవర్ నిర్మాణంలో ఉండటంతో వాహనాల రాకపోకలు వన్ వేలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గంటల కొద్ది వాహనాలు నిలిచిపోయాయి. మరో రెండు రోజులు గేటు మూసివేయడంతో స్థానిక పోలీసులు ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.